క్లుప్తంగా

రాణించిన రిమ్స్ పీజీ వైద్య విద్యార్థులు



విద్యార్థులతో రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశాఖపట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫోరోన్సిక్ మెడిసిన్ సదస్సులో కడప రిమ్స్ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులు రాణించారు. ఈనెల 16, 17 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో డాక్టర్ కె.ఆమని పోస్టర్ ప్రెజెంటేషన్‌లో తృతీయ బహుమతి, డాక్టర్ నిఖిల్‌సింగ్ క్విజ్‌లో విన్నర్‌గా, డాక్టర్ ఖాదర్ బాష క్విజ్‌లో రన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, డాక్టర్ టి.శారద విద్యార్థులతోపాటు ఫోరెన్సిక్ విభాగ ఫ్యాకల్టీని అభినందించారు.

వైవీయూ పరిశోధకుడికి డాక్టరేట్



మహేష్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిశోధకుడు కె. మహేష్‌కు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. పీఎస్ అండ్ పీఏ శాఖ ఆచార్య జి. పార్వతీ పర్యవేక్షణలో 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ రూరల్ ఆంధ్ర ప్రదేశ్- ఆపర్చునిటీస్ అండ్ ఛాలెంజెస్ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ గ్రామపంచాయతీ ఇన్ అనంతపురం డిస్ట్రిక్ట్' ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

మెడిసిన్ విద్యార్థికి ఆర్థిసాయం



విద్యార్థి తల్లికి నగదు అందజేస్తున్న బాసట సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ వైద్య విద్యార్థికి సాయం అందించి అండగా నిలిచింది. కడపకి చెందిన లోకేష్ రేణిగుంట శ్రీ బాలాజీ మెడికల్ కాలేజీ లోవైద్య విద్య రెండో సంవత్సరం చదువుతున్న నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ విషయం విద్యార్థి తల్లి బాసట సంస్థ కీలక సభ్యులైన డీపీ కార్తీక్ రెడ్డికి విషయాన్ని తెలియజేసింది. దీంతో ఆయన స్పందిస్తూ విద్యార్థికి రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా బాసట అధ్యక్షులు ఎం.బాలాజీ రావు మాట్లాడుతూ చదువుకొనే పిల్లలకు మా వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఆయన తెలియజేశారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వైవీయూ : కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం మేనేజ్‌మెంట్ స్టడీస్‌కు చెందిన 9 మంది విద్యార్థులు క్యాంపస్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నాగమణి తెలిపారు. పూణేకు చెందిన మల్టీ నేషనల్ కంపెనీ డేమియం రీసెర్చ్ ఈనెల 19వ తేదీన నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో కళాశాల విద్యార్థినులు 9 మంది 2.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగావకాశాలు పొందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కె. రాజేశ్వరమ్మ, వైస్ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, ఎండీ కె. చంద్ర ఓబులరెడ్డి, ఏఓ ప్రేమ్‌కుమార్ అభినందనలు తెలిపారు.

పది పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

వల్లూరు : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో బుధవారం ఉదయం ఇంగ్లీషు పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 361 మంది విద్యార్థులు హాజరు కావాల్సి వుండగా 358 మంది హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇందులో గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో 244 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి వుండగా 241 మంది విద్యార్థులు హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 117 మంది పరీక్ష రాయాల్సి వుండగా 117 మంది హాజరయ్యారు. కాగా మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఏపీ మోడల్ స్కూల్‌లో 281 మంది విద్యార్థులకు 266 మంది హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు 228 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు.

పట్టుదలతోనే లక్ష్యాన్ని చేరుకోవచ్చు



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, ఇతర అతిథులు

- మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్
- ఉల్లాసంగా దంత వైద్యకళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని కడప మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. బుధవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల వార్షికోత్సవ వేడుకలు వైభవ్-24 పేరుతో ఉల్లాస భరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ మాట్లాడుతూ పట్టుదలతో కష్టపడి చదివినపుడే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలమన్నారు. సమాజంలో వైద్యుడిని ఎంతో గౌరవిస్తారని తెలిపారు. ప్రజలకు విశేష సేవలు అందించినపుడే సమాజంలో వారికి తగిన గుర్తింపు, గౌరవాలు లభిస్తాయన్నారు. వైద్య వృత్తి పవిత్రమైనదిగా భావించి విద్యాభ్యాసం అనంతరం పేద ప్రజలకు తనవంతుగా సేవలు అందించాలని ఆయన సూచించారు. కడప దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం .జ్యోత్స్న, తిరుపతి తేజ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, విజయవాడ దంత వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ మురళీమోహన్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ప్రతి విద్యార్థి ప్రస్తుతం చదువుతున్న కోర్సు పూర్తయ్యాక స్పెషలైజేషన్ పూర్తి చేసి వైద్య వృత్తిలో రాణించాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అతిథులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దంత వైద్య కళాశాల ప్రొఫెసర్లు బాలసుబ్రమణ్యం, యుగంధర్, చంద్రశేఖర్, సుధామాధురి, సత్యనారాయణ, కోటయ్య, మాధురి, శ్వేత, దాశరథి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించడం తథ్యం



ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న బేడ, బుడగజంగం నాయకులు

కడప కార్పొరేషన్ : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించడం తథ్యమని బేడ, బుడగజంగం హక్కుల పోరాట సమితి నాయకులు పస్తం అంజి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండే రవీంద్రనాథ్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యే అయితే కమలాపురం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యాసిన్ బాషా, రాముడు, తులసీ కుమార్, ఆంజనేయులు, మంతయ్య, వెంకటేష్, బాలు పాల్గొన్నారు.

వైవీయూలో ప్రపంచ అటవీ దినోత్సవ వేడుకలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సంయుక్త నిర్వహణలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ కామర్స్ భవనంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఎన్. వెంకట్రామిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అడవులు లేకపోతే మానవాళి మనుగడకే ముప్పు అని, అటవీ సంరక్షణ బాధ్యత మన అందరిదీ అని అన్నారు. మీరు గీసే చిత్రాలు అడవులను, పర్యావరణాన్ని రక్షించేలా ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా శ్రీధర్ రెడ్డి, డా. కోట మత్యుంజయ రావు, డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా డా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని , అడవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డా మృత్యుంజయ రావు మాట్లాడుతూ అడవులు మానవ జాతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ, అటవీ విస్తీర్ణం పెంచుకొంటూ వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చదలవాడ వెంకటేష్, బి. చిన్నరాయుడు, బి. ఈరప్ప, చంటి సూరి, శ్రీమతి ఎం. వాసవిలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం 13వ డివిజన్‌లోని అరవిందనగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్యాంగ్ వర్క్ ద్వారా కాలువలు శుభ్ర పరచాలని, స్టాక్ రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా విభజించాలని, చెత్తను తొలగించేందుకు కాంపాక్టర్లను సక్రమంగా ఉపయోగించాలని తెలిపారు. నగరంలోని అన్ని వార్డుల్లో జీరో గార్బేజ్ పాయింట్లు ఉండేలా చూడాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైవీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రజలు

వైవీయూ : ఓటు అత్యంత విలువైనదని, ఓటుతోనే ప్రజ్వాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'ఓటరు అవగాహన పోస్టర్ల'ను వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అర్హులైన వారంతా ఓటు వేసేలా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకులు ఓటును వేయడం బాధ్యతగా భావించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సామాజిక చైతన్యంతో పాటు రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా గ్రామీణ ప్రజలలో ప్రేరణ నింపాలన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్- 5 ప్రోగ్రాం ఆఫీసర్, ఎకనామిక్స్ ప్రొఫెసర్ ఆచార్య కె.అనిత మాట్లాడుతూ కొప్పర్తిలో వారం రోజులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో మొక్కలు నాటడంతోపాటు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పోస్టరు విడుదల కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ గంగయ్య పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

కడప కార్పొరేషన్ : భారత రాజ్యాంగం దేశ పౌరులకు ఇచ్చిన ఓటు అనే హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కడప ఎన్నికల రిటర్నింగ్ అధికారి జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. బుధవారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల, వై జంక్షన్ కూడలి వద్ద ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల భాగస్వామ్యం గురించి వివరించారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ ప్రవీణ్, రెవెన్యూ విభాగం సిబ్బంది, కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీలో విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న ఏఎఫ్‌యూ విద్యార్థిని తేజస్విని

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ విభాగంలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని వి. తేజస్వినికి తెలంగాణ రాష్ట్ర స్థాయిలో మూడోస్థానం లభించింది. గతేడాది డిసెంబర్ నెలలో తెలంగాణ అటవీశాఖ ఆధ్వర్యంలో కాసుబ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) నేషనల్ పార్కు 25వ వార్షికోత్సవం పురస్కరించుకుని 'కేబీఆర్ త్రూ కెమెరా ఐస్' అన్నథీమ్‌తో నిర్వహించిన ఫొటోగ్రఫీలో తేజస్విని పాల్గొని మూడోస్థానంలో నిలిచింది. బుధవారం హైదరాబాద్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా తెలంగాణ అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఎం.సి. ఫార్గెన్ చేతుల మీదుగా రూ.5వేలు నగదు, బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. విద్యార్థిని ప్రతిభ పట్ల డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి, ఫొటోగ్రఫీ విభాగం సమన్వయకర్త డా. సంపత్‌కుమార్ అభినందనలు తెలిపారు.

కడపకు చేరుకున్న కేంద్ర బలగాలు



కేంద్ర బలగాలకు స్వాగతం పలుకుతున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ రాష్ట్రాల నుంచి కేంద్ర బలగాలు కడపకు చేరుకున్నాయి. బుధవారం సాయంత్రం ప్రత్యేక రైలులో వచ్చిన వీరికి రైల్వే కడప పోలీసులు స్వాగతం పలికి ఆహ్వానించారు. ఈరోజు నుంచి కడప జిల్లాలో వివిధ ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించడంతో పాటు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా విధులు నిర్వహించనున్నారు.

నేటి నుంచి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పాపాగ్ని నదీ తీరాన మాచిరెడ్డిపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి 28వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఉదయం స్వామి వారికి అభిషేకాలు, సాయంత్రం విశ్వక్సేనారాధన, ధ్వజారోహణం, అంకురారోహణం, అగ్ని ప్రతిష్ట, 22న ఉదయం ప్రధాన కళశ స్థాపన, సాయంత్రం వివిధ హోమాలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, 23న ఉదయం వివిధ హోమాలు, సాయంత్రం లక్ష్మీ సహస్ర నామ కుంకుమార్చన, 24న సాయంత్రం సుహాసినీలతో లక్ష్మిపూజ, కుంకుమార్చన, 25న మధ్యాహ్నం 11:20 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉత్సవాల్లో వివిధ పోటీలు : బ్రహ్మోత్సవాలలో పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 23న రాత్రి 9 గంటలకు రంగస్థల పద్యముల పోటీలు, 24న ఉదయం 9 గంటలకు ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, రాత్రి 9 గంటలకు తాళం భజన పోటీలు, 25న ఉదయం 9 గంటలకు చెక్క భజన పోటీలు, 10 గంటలకు అల్లెం గుండు ఎత్తు పోటీలు, మధ్యాహ్నం బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు. రాత్రి పాటకచ్చేరి జరుగుతుందని తెలిపారు.

అనుమతి లేనిదే ప్రచారం నిర్వహించరాదు


- ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు
- విలేకరుల సమావేశంలో జేసీ, ఆర్ఓ గణేష్‌కుమార్



మాట్లాడుతున్న జేసీ, ఆర్ఓ గణేష్‌కుమార్

కమలాపురం : మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అన్ని రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని జేసీ, రిటర్నింగ్ ఆఫీసర్ గణేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాలకు, బహిరంగ సభలకు, లౌడ్ స్పీకర్లకు, ఇంటింటి ప్రచారం నిర్వహించడానికి ఆర్ఓ నుంచి తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేయాలన్నా, బ్యానర్స్, జెండాలు కట్టాలన్నా అనుమతి తప్పని సరి అన్నారు. ముఖ్యంగా వాల్ రైటింగ్స్ చేయకూడదన్నారు. అనుమతి లేకుండా ప్రచారం సైతం నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. ప్రచారం నుంచి ఓటింగ్ ముగిసే వరకు ఖర్చును నమోదు చేస్తామన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ తప్పని సరిగా పాటించాలన్నారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. వలంటీర్లు ప్రచారంలో, ఎన్నికల విధుల్లో పాల్గొంటే డిస్మిస్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే వలంటీర్లకు సమావేశం నిర్వహించి ఎన్నికల విధుల్లో, ప్రచారంలో పాల్గొనవద్దని సూచించామని, ఎవరైన తిరిగితే వారిని తొలగిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఎన్నికల విధుల గురించి వివరించారు. ఏఆర్ఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో విద్యార్థి ప్రతిభ



పవన్‌కల్యాణ్

ప్రొద్దుటూరు: బెంగళూరుకు చెందిన కీమో సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై దేశ వ్యాప్తంగా నిర్వహించిన డిజిటల్ పోటీ పరీక్షలో స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజిలో బీటెక్ ఈసీఈ చివరి సంవత్సరం విద్యార్థి వి.పవన్‌కల్యాణ్ మొదటి స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వర రావు బుధవారం తెలిపారు. కళాశాల చైర్మన్ హుస్సేన్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థి ప్రతిభను గుర్తించి కీమో సంస్థ వారు పవన్‌కల్యాణ్‌కు రూ.20 వేలు నగదు బహుమతి ప్రకటించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు భవిష్యత్తులో మరెన్నో అవకాశాలు పొందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సిద్దేశ్వర్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలపై కేసు

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఇందులో భాగంగా పోలీసు, రెవెన్యూ అధికారుల బృందం నిరంతరం నిఘా ఉంచారు. కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్కాయపల్లి డీఎంహెచ్ఓ కార్యాలయం వెనుకవైపున మడక చక్రధర్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా తనతో పాటు మరో ఇద్దరికి తమ వాహనాలపై టీడీపీ ప్రచారం స్టిక్కర్లను అతికించారు. ఈక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వారు అతనితో పాటు స్నేహితులపై కేసు నమోదు చేశారు. నాలుగు వాహనాలను సీజ్ చేసినట్లు కడప తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలియజేశారు.

టీడీపీ నుంచి అదే పార్టీలోకే వలసలు



మాట్లాడుతున్న మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి

కమలాపురం : కమలాపురంలో టీడీపీ నుంచి తెలుగు దేశంలోకే వలసలు జరుగుతున్నాయే గాని వైఎస్సార్ సీపీ నుంచి కాదని, ఇలాంటి వలసలతో తమ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి 30 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయం అని మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం కొన్ని పత్రికల్లో అప్పాయపల్లెలో ఆగని వలసలు అనే వార్త ప్రచురితమైందని, ఆ వార్తలో టీడీపీ కండువా వేసుకున్న సునీల్‌రెడ్డి కండువా వేసుకోవడం ఇది మూడోసారి అన్నారు. అలాగే మాచిరెడ్డిపల్లె క్రాస్‌లో కండువా వేసుకున్న వ్యక్తి సామాన్య ఓటరు అంతే కాని, వారు తమ పార్టీ వైఎస్సార్ సీపీ కండువా ఏ రోజు వేసుకోలేదని, జెండా మోయలేదని, అలాగే తమ పార్టీ సభ్యత్వం కూడా తీసుకోలేదని, ఏజెంట్‌గా కూర్చోలేదన్నారు. దీనిని బట్టి రెండు నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి చేసిన వ్యాఖ్యలు టీడీపీ నుంచి తెలుగుదేశంలోకే వలసలు అన్న కామెంట్ కరెక్ట్ అనిపిస్తోందని ఎద్దేవా చేశారు. కొన్ని నెలల క్రితం మా మేనత్త కొడుకు శంకర్‌రెడ్డి కూడా టీడీపీలో చేరాడు. అతను కూడా తనతో ఏ రోజు తిరగలేదని, అతడిని సామాన్య ఓటరుగానే గుర్తించాలే తప్పా, అతను వైఎస్సార్ సీపీ నాయకుడు కాదని స్పష్టం చేశారు. దీనిని బట్టి టీడీపీలో చేరికలన్నీ బూటకమేనన్నారు. ఇలాంటి చేరికలకు టీడీపీ నుంచి తెలుగుదేశంలోకి అనే క్యాప్షన్ పెట్టుకోవాలని ఆయన సూచించారు. మా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఒకటే చెప్పారన్నారు. మీ కుటుంబానికి, మీ గ్రామానికి, మీ వీధికి మేలు జరిగితేనే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని చెప్పారని, ఇంత దమ్మున్న సీఎంను ఎప్పుడైనా చూశామా? అని ప్రశ్నించారు. మనకు గుర్తుకు వచ్చినప్పటి నుంచి కమలాపురంలో ఇంత అభివృద్ధి ఎప్పుడైనా జరిగిందా? అని ప్రశ్నించారు. మైసూరారెడ్డి, వీరశివారెడ్డి, పుత్తా నరసింహారెడ్డి హయాంలలో ఇంత అభివృద్ధి జరిగిందా? అని అన్నారు. అభివృద్ధి పనులకు కూడా అధికారులను బెదిరించి ఆటంకం కలిగిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కోడ్ రాక ముందే అగ్రిమెంట్ చేసుకున్న పనులను సైతం ఎలా చేస్తారని టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారని, కేవలం ప్రజల సౌకర్యం కోసం ప్రజలకు ఇచ్చిన మాట కోసమే రోడ్లు వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.